# ప్రార్థనలు - ధ్యానములు

స్వామి ఓంకార్

ద మిషన్ ఆఫ్ పీస్

**శ్రీ శాంతి ఆశ్రమము**

**తోటపల్లి కొండలు, వయా శంఖవరం-533 446**

తూ॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్

ఫోన్ : 7382009962

email: srisanthiashram@gmail.com

website : srisantiashram.org.in

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ప్రార్థన | 5 |
| 2. | ప్రార్థన - నూతన సంవత్సర | 6 |
| 3. | ప్రార్థన - నూతనసంవత్సర | 7 |
| 4. | ప్రార్థన - హృదయపూర్వక | 8 |
| 5. | ప్రార్థన - నూతన సంవత్సర | 9 |
| 6. | ప్రార్థన - నూతన సంవత్సర | 10 |
| 7. | ప్రార్థన - నూతన సంవత్సర | 11 |
| 8. | ప్రార్థన ధ్యానాదులు - నూతన సంవత్సర | 12 |
| 9. | ధ్యానము | 14 |
| 10. | ధ్యానము- నూతన సంవత్సర | 15 |
| 11. | ధ్యానము | 16 |
| 12. | ధ్యానము | 17 |
| 13. | ధ్యానము | 18 |
| 14. | ధ్యానము | 19 |
| 15. | ధ్యానము | 20 |




## ప్రార్థన

అఖండ సచ్చిదానందస్వరూపా! నీ దివ్య తేజస్సునకు అనంతకోటి ప్రణామములు. నీకు ధన్యవాదములు అర్పించుట తప్ప, మేము చేయుటకు మరేమియున్నది. నిర్హేతుక జాయమాన కటాక్షుండవై, నీవు సర్వమును మాకు యొసంగియుండ, యింకను "ఇది కావలెను, అది కావలెను" అని నిన్ను కోరుట, మా హృదయ దౌర్బల్యముతప్ప అన్యముగాదు. హృదయమునకు హృదయముగా, ఆత్మకు అంతరాత్మగా, నీవు వెలుంగుచుండ, వ్యర్థమైన వాక్కులతో, "అది ఇమ్ము, ఇది ఇమ్ము" అని నిన్ను ప్రార్థింప ప్రయత్నించుట అజ్ఞానముగదా!

కృపామయా! నీవు సదా హృదయాంతరవాసివై యుంటివన్న సత్యమును మరచి, నీవు యెచ్చటనో యుంటివనెడి భ్రమతో నిన్ను ఆలింగనము చేసుకొనుటకు తరచు మా హస్తములను చాచు చుందుము. మా ప్రార్థనలను పంపుచుందుము. బహిర్ముఖముగా, పరుగెత్తుచున్న యీ ఇంద్రియములను, మనస్సును, నీవైపే, అంతర్ముఖమునకు, ప్రవహించెలాగున కరుణింపుము. నామరూపములవైపు, వెంబడించుచున్న, యీ యింద్రియ సముదాయమును, నామరూపరహితమైన నీ దివ్య తేజస్సులో విలీనమయ్యెడిలాగున కరుణింపుము.

లోకపితా! నిర్హేతుకముగా, నీ కృపను మాయందు జూపవలెనన్న మేము సదా నీ స్వరూపమును, ఆంతర్యమున, బాహ్యమున, మానవకోటి అంతటిలో దర్శించెడిలాగున తోడ్పడుము. అట్టి స్థిరత్వమును శాశ్వతముగా గలుగజేయుము. ఇదియే మా ప్రార్థన!

హరిః ఓం తత్ సత్!

(శాంతి మార్చి 1960)

## ప్రార్థన

భక్తవరేణ్యులకు, దైవ బిడ్డలకు ప్రతిరోజును నూతన సంవత్సర దినమే గదా! కృపామయుండైన దైవము సర్వాంతర్యామియై సర్వత్రా నిండియుండ ప్రతిరోజును జన్మదినమే! ప్రతి తావును పావనమైన ప్రదేశమే!

కృపామయా! దీనదయాళూ! నీవు సర్వమును మాకిచ్చియుండ, ఇంకను మేము దేనికైప్రార్థించవలెను? ఆంతర్యమున, బాహ్యమున, మీదను, క్రిందను, చుట్టును అందరిలో నీవే? సర్వములోనిన్ను గుర్తించుటయే మా ప్రార్థనగా నుండనిమ్ము!

ఏదైనను ప్రార్థన చేయవలసియున్న, మాకు ప్రార్థన తప్పని యెడల, సర్వేజనా స్సుఖినోభవంతు; లోకములో జనులందరూ సుఖముగా నుందురు గాక! లోకా స్సమస్తా స్సుఖినో భవంతు! లోకములో అందరును శాంతిగా నుందురుగాక యని ప్రార్థించనిమ్ము.

దేశవృద్ధియే మా వృద్ధి, లోకశాంతియే మా శాంతిగా చేయుము. మానవకోటిని ప్రేమించుటయే నిన్ను ప్రేమించుట, ఏలనన మానవ కోటియు, నీవును యెన్నడును రెండుగాక ఒక్కటిగానే యుండిరి.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి జనవరి 1968)



## ప్రార్థన

ప్రభూ! ఈ నూతన సంవత్సరమున యేమని నీకు ప్రార్థన జేయుదును?

ప్రార్థన, నన్ను నీలో విలీనము జేయుచు జీవాత్మ పరమాత్మల ఐక్య సంధానమును గల్గించునట్లు చేయుము.

ఎవరని నిన్ను నిర్ణయించేదిరా? నీవు యెచ్చట యున్నావు నా దైవమా! నీవు దూరముగాయున్న, నీకు వినిపించుటకు బిగ్గరగా ప్రార్థన చేయవలెను, నీవు దగ్గరలోనే ఆంతర్యముననే యున్న, నెమ్మదిగానే, నిశ్శబ్దములోనే ప్రార్థన చేయవలెను.

అంతా రామమయం, ఈ జగమంతా రామమయం గాన, సర్వములో సర్వత్రా సదా నిన్నే గాంచుచు, మా నూతన సంవత్సరమును ప్రారంభించెదముగాక!

నీవు అద్వితీయుడవై, సర్వము నిండి, సర్వజ్ఞతతో వెలసియుంటివిగాన, మా స్వార్థ రహితమైన జీవితమునే గొప్ప ప్రార్థనగ జేయుము.

మొక్కను, పక్షిని, జంతువును, మానవుని ఒకేరీతిగా విశ్వప్రేమతో ప్రేమించెడివారే నిజమైన ప్రార్థనను జేయుచుండిరి.

ఈ నూతన సంవత్సరమున మానవకోటినంతను, స్వార్థ రహితముగా ప్రేమించుచు, అందరిలో నిన్నే దర్శించుచు, ప్రేమించుచు విశ్వశాంతితో, నిశ్శబ్దముగా, సర్వులలో పూజించుటయే మా నిజమైన, శాశ్వతమైన, స్థిరమైన ఏకైక ప్రార్థనగా సదాయుండనిమ్ము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి జనవరి 1969)

## హృదయ పూర్వక ప్రార్థన

ప్రియమైన దైవమా!

ఈ శరీరము, అమాయకులను అతి క్రూరముగ, అకారణముగ నిందించుటలో ఆనందము పొందువారిచే భూమిపై యినుప మడములచే త్రొక్కబడునుగాక.

ఓ కరుణామయా! నీ అనుగ్రహముచే మాలో తగిన బలముండే ఆధ్యాత్మిక శక్తి, కలిగించి సదా ప్రేమయే అట్టివారల యెడల కూడ మానుండి ప్రవహింపనిమ్ము.

దైవచట్టము ఏమనగా;

జనులు మమ్ములను గురించి చెడుగా మాట్లాడినప్పుడు మమ్ముల నెంతమాత్రము బాధించదు. కాని మేము యితరులను గురించి చెడుగా తలచినను, మాట్లాడినను అది మాకు బాధించి హానిచేయును. కాన, అందరి యెడల మానుండి ప్రేమయే ప్రవహించుగావుత! ఎందుకనగా, అందరు నీ అద్వితీయమైన పరమాత్మ ప్రతిబింబములేగదా. ఆశ్రమ బిడ్డలు వారి సర్వస్వము దైవార్పణజేసి వివిధ నామరూపములతో ఆశ్రమము సందర్శించు నీ ప్రతి బింబములను హృదయ పూర్వకప్రేమతో, స్వార్థరహితముగ సేవ జేయుచున్నంత వరకు వారిని కాపాడి రక్షించు బాధ్యత నీయదియేగదా పరమాత్మా!

ఇదియే మా హృదయ పూర్వక ప్రార్థన.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి జూన్-జూలై 1969)



## ప్రార్థన

ఈ నూతన సంవత్సర శుభసమయమున ప్రేమాస్పదులగు మీకేమి అర్పింపను. పరమపావనమైన మౌనయజ్ఞము నారంభించి మీ అందరి శ్రేయస్సునకై ప్రార్థన సల్పుదునుగాక!

మా పాతకులకేగాక లోకములోని మానవాళికంతకును యీ సమయమున శుభోదయమగుగాక! ఈ దినము స్నేహపాత్రమై, ప్రత్యణువునందును ఆదివ్యానుభూతిని పొందుచు, సృజనాత్మకమగు గాక! సకల చరాచర సృష్టి యందును ఆ జ్యోతి స్వరూపమే దర్శించునుగాక!

మానవసేవయే మాధవసేవ. ఇదియే నా శాంతికి, మీ శాంతికి విశ్వశాంతికి మూలము మీరందరు నావారని ప్రేమించగల్గుటయే. అదెంతటి భాగ్యము? సకల సామ్రాజ్యాధి నేతలయందును, నిరంకుశ పాలకులందును ప్రజా ప్రతినిధులందును మార్గదర్శకులై మనువారియందును, అందరి యందును శాంతి, సామరస్యములు ప్రతిష్ఠింపబడుగాక! ఆపరమపావనమైన శాంతి నిరాడంబరమగు నా హృదయమున వెలయు మౌనస్థితినుండి ఆరంభింపబడుగాక! ఇదియే ఈ నూతన సంవత్సర శుభోదయమున మీ అందరి శ్రేయస్సును కోరు మీ సోదరుడు ఓంకారుని ప్రార్థనయై యున్నది.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి జనవరి 1974)

## నూతన సంవత్సర ప్రార్థన

హే ప్రభూ! 82వ జన్మదినము పరుగుపరుగున వచ్చుచున్నది. ఇంత వరకు 81జన్మదినములు గడిచినవి. ఈ 81 సంవత్సరములు శాంతి ఆశ్రమపేరున ప్రవృత్తి పరులను యాచించుచు, భక్తులకు శ్రమనిచ్చుచు విలువైన కాలమును వ్యర్థపుచ్చితిననే చింతించుచుంటిని.

ఈ 21-1-76 తారీఖున నూతన సంవత్సరములో రాబోయెడి జన్మదినమునకు ఆశ్రమభక్తులు, గురుకుల బాల బాలికలు, వృద్ధులు వృద్ధికై లక్షరూపాయలు పర్సు నర్పించుటకు పూజ్యులైన శ్రీశ్రీ చిదానందస్వాములు వారు హిమాలయములనుండి వచ్చుచున్నారు. ఈ రోజులలో తలవని తలంపుగ శ్రీ త్యాగరాజకీర్తన నిధి సౌఖ్యమా! రాముని సన్నిధి సౌఖ్యమా! అనెడి కృతి సదాజ్ఞప్తికి వచ్చి ఓ ప్రభూ! నాకు నిధి వలదు. రాముని సన్నిధే కావలెనని అంతరాత్మకోరు చుండును. తుప్పుపట్టెడి, దొంగలపహరించెడి అనిత్యమైన ధనమునే సర్వముగా జేసుకొని తమ జన్మహక్కును, మానవజన్మకు గమ్యస్థానమైన ఆంతర్య ధనమును, ఆత్మధనమును మరచి జీవించుచున్న ప్రవృత్తిపరులైన ధన ఆరాధకులకు శ్రమగల్గించ కుండా, రాముని సన్నిధి అనెడి నిజమైన, శాశ్వతమైన అమృతతుల్యమైన ధనమునే యీ మనస్సు హృదయపూర్వకముగా కోరుటకు అనుగ్రహింపుము.

ప్రియమైన శాంతి పాఠకులారా! మీభక్తి, ప్రేమ హృదయములనుగూడ సర్వజ్ఞుండైన దైవమునకు యీ నూతనజన్మదినము జ్ఞాపకార్థముగా అర్పించి ఇప్పుడు మనమందరము కలిసి శ్రీరాం జయరాం జయజయరాం అనెడి మహా మంత్రమును స్మరించుచు తరించెదముగాక!

ఓం సర్వేషాం స్వస్తిర్భవతు।
ఓం సర్వేషాం శాంతిర్భవతు।
ఓం సర్వేషాం పూర్ణంభవతు ।
ఓం సర్వేషాం మంగళంభవతు ।

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి జనవరి 1976)



## ప్రార్థన

నూతన సంవత్సర ప్రారంభ సమయమున

అంతటా నిండియుండు మహాతేజస్వరూపమా! వివిధ దేశముల యందలి నీబిడ్డలు అనేక నామములతోడ పలుతెరంగులనిన్నారాధించు చున్నారు. పూజనీయ మగు నీ తేజమును, ప్రేమయును, ఐకమత్యమను పాశముచే మమ్మెల్లర బంధించు గాక!

నిన్ను నామరూపములు లేకయే సమస్త జీవుల హృదయములందు నీవు నివసించు చున్నటుల భావించి యారాధించుటను మేమెల్లరమును సత్వరముగా నేర్చుకొనెదముగాక! నీ సంకల్పము స్వర్గమందువలెనే భూమియందు గూడ నెరవేరును గాక!

శాంతి ప్రేమలనెడి అగ్ని జ్వాలల యందుపడి నీచత్వము, స్వార్థపరత్వము, అయోగ్యత దగ్ధమై నీ మహిమను వ్యక్తముగావించు పరిపూర్ణత్వమును, ఐకమత్య మును, బ్రహ్మానందమును ఒసంగును గాక!

ఓం ఓం ఓం

(శాంతి జనవరి 1986)

## నూనత సంవత్సర ప్రార్థన ధ్యానాదులు

భక్తి ప్రేమస్వరూపులు, ప్రియతములగు శాంతి పాఠకులకు ఈ మనస్సు తాననుభవించెడి ఏ చిన్న విషయమునైనను గొప్ప సమాధిస్థితినైనను మా శాంతి పాఠకులతో పంచుకొనుటకే సదా కోరుచుండును. నిత్య సత్యమగు శాశ్వతానందము మనమనుభవించెడి దైవానుభూతిని యితరులతో పంచుకొనుటలోనేగలదు.

ఈ దినములలో ఒక్కనూతనానుభవము నాకెంతయో శక్తిని కల్గించు చుండును. కండ్లుమూసినను తెరిచినను దైవమే! కన్నులు మూసిన ఎంత ఆనందము, శాంతి కలిగించును! అట్టి స్థితిలో నఖశిఖ పర్యంతము, శరీరమునందలి అణువణు వునా ఆదైవమే నిండియుండెననెడి భావన ఎంత ఆనందమును కల్గించుచుండెనో గదా! ఆ స్థితిలో "ఓం శ్రీరామ జైరామ జయ జయరామ ఓం" అనెడి మహామంత్ర మును జపించుచు, శరీరమందలి ప్రత్యణువును ఆ దైవశక్తిచే నింపుటచే కల్గు ఆనందము, తృప్తి వర్ణింపజాలముకదా!

ప్రియమైన శాంతిపాఠకులారా! మీకు నిజమగు దైవపరితాపనయున్నచో, ఈ చిన్న అనుభవము ఒక్కటైనచాలదా? కన్నులు మూసినదైవమే, కన్నులు తెరిచి నను దైవములేనిస్థలము సూదిమొన మోపుటకైనను కానరాదు. పిపీలికాది బ్రహ్మ పర్యంతము ఆ దైవమే, "అంతా రామమయం, ఈ జగమంతా రామమయం" కావున ఆ శ్రీరామునే, ఆత్మారామునే దర్శించుచు తరించెదరుగాక! ఇదియే మా నూతన సంవత్సర ప్రార్థన. దీనినే నిరంతర ధ్యానముచేసి మీ కాలమును సద్విని యోగము చేయుచు తరించుడు. మీరు స్మరించుటయేగాక, మీ బంధుమిత్రులచే, బాల బాలికలచే, ఎల్లరిచే యీ మహామంత్రమును స్మరింపజేయుడు. మరల మరల "ఓం శ్రీరామ జయరామ జయ జయ రామ ఓం" అని స్మరించుటచే ఎప్పుడోగాక ఇప్పుడేతరించెదరు. ఇదియే దుర్లభమైన మానవ జన్మయొక్క గమ్యస్థానము. మీరంతా బ్రహ్మ సాక్షాత్కారమును అపరోక్షముగా అనుభవించుకొరకే సదా నేను కోరుచుంటిని. దైవానుభూతిని ఈ క్షణములో పొందుటయే నాకును, శాంతి ఆశ్రమమునకు, జీవించి యున్నవారికి, గతించినవారికి మీరు చేయగలిగిన గొప్ప సహాయము.

దైవపరితాపన గలవారికి పెక్కుమాటలేల? దైవ పిపాసకులకు ఒక్కమాట చాలును, ఏదియన ఏదైవముకొరకు మీరు గుడిగోపురములలో, తీర్థయాత్రలలో వ్యయ ప్రయాసలతో వెదకుచుండిరో, ఆ దైవము పవిత్రమగు మీ ఆంతర్యమున దేదీప్యమాన ముగ ప్రకాశించుచుండెను. మీ హృదయములకు హృదయముగ, మనస్సులకు మనస్సుగ, శ్వాసకు శ్వాసగా మీకొరకై వేచియుండెను.



ఇక తడవేల? తరించుటకిదియే సమయము.నేడేమనది. రేపు మనదికాదు. కావున ఈ క్షణమునుండియే తరించుటకు ప్రయత్నింతుమని, దైవములో లీన మయ్యెదమని, హృన్నివాసియగు ఆ దైవమునకు, ఈ నూతన సంవత్సర శుభసమయ మున వాగ్దానముచేయుచు, ముమ్మారు ప్రణవనాదము గావించుచు, మనో వాక్కాయ ములను ఆ దివ్య తేజస్సుతో పునీతము గావింతముగాక! విశ్వశాంతికి, లోక కళ్యాణ మునకు నిరంతర ప్రార్థన ధ్యానాదులు సల్పుదుముగాక!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి జనవరి 1973)

## ధ్యానము

ఈ నూతన సంవత్సరారంభమున మహాత్ములపై ధ్యానము సల్పవలెను. బుద్ధునిపై ధ్యానమునుంచి, మన ప్రత్యణువునందున అతని కరుణాభావముచే నింపి, మానవాళినేగాక, మూగజంతువులపై కూడ ఆకరుణ ప్రసరించుటకై అర్థింతముగాక! ఇది పవిత్రమగు క్రిస్టమస్ సమయము కావున ప్రేమాన్వితుడగు క్రీస్తుప్రభునిపై ధ్యానము నుంచి అందరిని మనప్రేమ బంధములో యిముడ్చుకొనగల శక్తికై ప్రార్థింత ముగాక! గాంధీ మహాత్మునిపై ధ్యానమునిల్పి, వారి సత్యాహింసలు మన జీవితము లందు అనుక్షణము ఆచరించునట్లొనగూర్పుడని వేడుదుముగాక! లయకారకుడగు పరమశివునిపై ధ్యానమునుంచి, అంతర్లీనులమై, సోహం భావనతో తైలధారవలె ధ్యానము సల్పుదుముగాక!

ఈ పరిమితమగు మాటలలో ధ్యానమునుగూర్చి ఎవరు చెప్పగలరు? ఆచరణ! ఆచరణ! ఆచరణ! ఇదియే ధ్యానమునకు ముఖ్యాంగము. ఈ మాటలన్నింటిని విడిచి, పరమోత్కృష్టమగు మౌన స్థితిలో పరమేశ్వరునిపై దృష్టి నిల్పి, తన్లీనుల మయ్యెదముగాక!

శివోహం సోహమస్మి సోహం

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

**అర్పణ**

**లోకములోని శాంతి కాముకులందరకు నా ప్రేమపూర్వక అర్పణ**

(శాంతి జనవరి 1974)



## ధ్యానము (నూతన సంవత్సర)

సర్వజ్ఞుండైన ఓ కృపామయా! శ్రీ రామకృష్ణ పరమహంసల విగ్రహమువద్ద శివలింగము చెంత శివాలయంమెట్లువద్ద వేదిక మీద కూర్చొని ఇప్పుడే నూతన సంవత్సరపు ప్రార్థన వ్రాసితిని. నేను వ్రాస్తినా? నీ అనుజ్ఞ ఆజ్ఞలేకుండ గడ్డిపరక యైన కదలదుగాన, ఆ ప్రార్థన నీవే వ్రాస్తివి. యీ ధ్యానము గూడ నీవే వ్రాయు చుంటివి. ఆ తపస్నానము, సూర్యరశ్మిలో జేయుచు నీ సన్నిధిని అనుభవించుచూ యీ ధ్యానమును నీకు అర్పించుట ఎంత అదృష్టము!

క్రీనీడవలె నన్ను వెంబడించుచు అహర్నిశములు నా చెంతనే యుండెడి ఓమీ గూడ సూర్యరశ్మిలో నా పాదముల వద్దనే పరుండి నీకు కృతజ్ఞతా నమస్కార ములు తెలుపుచున్నది. రాముని సన్నిధి యిటుల కోటి సూర్యుల ప్రకాశంతో వెలుంగు చుండ, శాశ్వతమైన నిత్యమైన నీ సచ్చిదానంద స్వరూపమును, ప్రత్యక్షముగా అనుభ వించుచు, యీ ఖండమైన మాటలతో నేనేమి వ్రాయగలను? అల్పమైన యీ వెర్రి వ్రాతలను మన్నించుము, రక్షించుము. నీ అపారమైన అఖండమైన ప్రేమతో నింపి బ్రోవుము! ఆశ్రమం పేరును, మాటలచే, ప్రవృత్తిపనులచే, అమూల్యమైన కాలమును వ్యర్థపుచ్చుచున్న నీవెర్రి బిడ్డను మన్నించి, కరుణించి, నిశ్శబ్దమైన నీ ప్రేమ హృదయ ములో విలీనము జేసుకొనుము! "నిశ్శబ్దో బ్రహ్మ మౌనం సర్వార్థ సాధనం" అనెడి సత్య వాక్కులను 82వ సంవత్సరం జ్ఞాపకార్థముగా, మౌనముగా, శాశ్వత శాంతి ననుభవించుచు, నీ అఖండ సచ్చిదానంద మహాసముద్రములో యిప్పుడే, యిచ్చటనే విలీనమవ్వనిమ్ము. దైవపరితాపనతో నిండియున్న భక్తులందరకు ఈ చిన్న అర్పణ.

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

(శాంతి జనవరి 1976)

## ధ్యానము

ఈ నూతన సంవత్సర ప్రారంభపు దినమున ఉషఃకాలములో ఉండేదే రాము డొకడు యూరక చెడిపోకె మనసా! అని సంబోధించుచు మన ధ్యానమును ప్రారంభించెదముగాక!

ముఖ్యముగా "కనుగొంటిని శ్రీరాముని నేడు" అని ధ్యానించెదముగాక!

ఎన్నో నోములు నోచినగాని ఈ నరజన్మము దొరకదు. గాన ప్రతిక్షణము సద్వినియోగము చేయుచు దినదినాభివృద్ధిని గాంచెదము గాక?

శ్లో॥ జ్ఞాతం జ్ఞాతవ్య మధునా
ద్రష్టం ద్రష్టవ్య మద్భుతం
చిరశ్రాంతోహం విశ్రాంతోస్మి
చిన్మాత్రా నాస్థి కించన!

తెలుసుకొనవలసినది తెలుసుకొంటిని. చూడవలసిన దృశ్యము చూస్తిని. బేధభావముతో యింతవరకు బాధపడితిని. అంతయు చిన్మాత్రమే. ఇప్పుడు దైవము తప్ప అన్యమైనది, ఎప్పుడును, ఎచ్చటనులేదని ఆనందించుచు విశ్రాంతిని పొందు చుంటిని.

సర్వేషాం స్వస్తిర్భవతు
సర్వేషాం శాంతిర్భవతు
సర్వేషాం పూర్ణం భవతు
సర్వేషాం మంగళం భవతు
లోకాస్సమస్తా స్సుఖినోభవంతు
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి జనవరి 1982)



## ధ్యానము

ప్రశ్న : నేను ఎప్పుడు స్వేచ్ఛ పొందుదును?

జవాబు : 'అహం' కారము సమసిపోయినపుడు

ఈ 'శాంతి' పత్రిక షష్ట్యాబ్ధిపూర్తి శుభసమయమున, ఈ 91వ జన్మదిన సుప్రభాతమున సోహం తేజస్సునందు లీనమై పోదును గాక. అదియే అమూల్యమగు మానవజన్మకు గమ్యము, ధ్యేయము.

దైవము నీలో ప్రత్యణువునందు నిండి నిబిడీకృతుడై యుండ, వెలుపలకు జూతువేల?

అంతర్ముఖులమై మనలో ప్రత్యణువునందును ఆ దైవానుభూతి నందుదుము గాక!

దైవము బాహ్యమున సర్వే సర్వత్ర నిండియుండ లోనకు చూతువేల?

దైవము బాహ్యమున పిపీలికాది బ్రహ్మ పర్యంతము నిండి యుండెను. సుందర సుగంధ సుకుమార పుష్పములందును, సర్వధాతువుల యందును, తరులతా గుల్మము లందును పశుపక్షి గణములందును, విశ్వమానవాళియందును నిండియున్నదా దైవము కాదా? "శాంతి" షష్ట్యబ్ధి జ్ఞాపకార్థముగా ఈ చిన్న 'నేను' అనుదానిని 'అహం'కారమును మరచి స్వయం ప్రకాశమానమగు, ఆ దివ్య తేజస్సున లీనమగు దుముగాక! ఇదియే పవిత్రమగు మానవ జీవితాశయము కావలెను.

విశ్వశాంతి నెలకొనుగాక!
నిశ్శబ్దము! తరంగ రహిత నిశ్శబ్దము! అనంత నిశ్శబ్దము!
తత్త్వమసి ఓం ఓం ఓం

(శాంతి జనవరి 1985)

## ధ్యానము

మోహమును పుట్టించెడి ఈ నామరూపాత్మక భౌతిక ఎండమావుల నుండి మనము వైదొలగి,కేవలము నిస్సంగుల మగుదుము గాక! మన సాంగత్యమెల్ల వేళల అంతర్జ్యోతితో పూజనీయమైన దివ్య స్వరూపునితో అబేధ్యమైన నిత్య సత్యముతో మనజీవిత గమ్యస్థానముతో సమస్త భూగోళముల కాధార భూతమైన దానితోనే మన సంసర్గము మన శరణ్యముకూడనైయుండుగాక!

మనంతట మనము సృజించుకొనియున్న ఆశ్రమములోని ఈ ప్రార్థనా మందిరముల వంటి ఇసుకతో నిర్మించిన కోటలు (వ్యర్థపుటాలోచనలు) ఎంతగా మనలను ఆకర్షించినను, మోహింపజేసినను, వానిని సడలింపజేసికొని నామరూప రహిత పరంజ్యోతితో కోటి సూర్యప్రభతో మనము చేరిపోదుముగాక!

అబేధ్యమైన మన సౌఖ్యమును, మన పరిశుద్ధ హృదయములలోని నిశ్శబ్దతలో నుండనిమ్ము! పూజనీయుడైన ఆ దివ్య తేజోస్వరూపునితో మనకు గల చేరికలోనే మన ఉత్తమమైన సౌఖ్యమున్నది. ఆ సౌఖ్యమంతయు మనకు మాత్రమే గాక సర్వేజనా స్సుఖినోభవంతు అన్నట్లుగా, అందరి సుఖముగా పరిణమించుగాక!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః హరి ఓం తత్ సత్ ఓం!

(శాంతి జూన్ 1985)



## ధ్యానము

(క్రీస్తు జన్మదిన పవిత్ర సమయమున)

అదిగో! ఒక గొప్ప జీవనాధారము. అందుండియే ప్రకాశమై ప్రేమ, తేజస్సు, జీవితములను ప్రవాహములు ఝల్లున ప్రవహించు చున్నవి.

మన మందరమును మనస్సాక్షిగా యిప్పుడే ఆ అమృత ప్రవాహమున స్నాన మాడుదముగాక!

భగవంతునియొక్క ప్రేమ వాహినియందే పవిత్రమైన శక్తిని మన మందరమును పొందుదుముగాక!

అతని దివ్యప్రేమయే మనలను చక్కని బిడ్డలనుగా చేయుచున్నది.

అతని ప్రకాశమానమైన నూతన జీవమే మన జీవితమందలి రక్తనాళము నందును కదలుచున్నది.

ఆ మహామహుని నుండి బహిర్గతమై ప్రవహించెడి జ్ఞానతేజమే మనలను అజ్ఞానము, ద్వైతము అను తప్పుదారుల పడనీయక సదా కాపాడుచున్నది.

ఆ భగవంతుని అనుగ్రహముచేతను, అతని ప్రేమచేతను ఆతని పూర్ణ ప్రతి స్వరూపులమై మన మందరమును పూర్ణత్వము నొందిన వారలమే ఎప్పుడో గాదు ఇప్పుడే. అదియే – అతని మహిమ.

ఓం ఓం ఓం

(శాంతి డిశంబరు 1985)

## ధ్యానము

ఓ స్వామీ! యీ పాపభూయిష్టమైన ప్రపంచమున నన్నేల జన్మింప జేసితివి? నేను నీ సుతుడనుగానా? తనయు బాధలను జూచియూరకుండు తండ్రియుండునా?

ఓ దేవా! మాతృగర్భమునుండి భూమిపైబడి యుదయమున లేచినదాది మరల నిద్రించువరకు సలుపు కృత్యంబులలో దెలిసియు దెలియక జేసిన పాపంబును శమింపజేయుము. నీ కుమారుల దోషంబులను నీవు హరింపవలదా?

ఓ నాథా! యీ బుద్బుద దేహమందు జవసత్త్వంబులు పుష్కలముగా నుండి నపుడు ధనభోగముల ననుభవించుచు మన్ను మిన్నుగానక విజ్ఞులకడ నిన్ను దూషించిన నేరము కాపాడును. నీ పుత్రుండు నిన్నాడిన మాటలు నీవు సహింప తగదా?

ఓ జగద్రక్షకా! నీవీ చతుర్దశ భువన కర్తవు, భర్తవు, హర్తవు. నీవే పరాత్పరుండవు. నీవల్లనే నిశాదివసంబులు సంభవించుచున్నవి. నీవల్లనేసర్వజీవనోపాధి కలుగుచున్నది. నీవల్లనే సకల కర్మలు సంజాతమగుచున్నవి. నీవే నా దైవము, నీవే నా దిక్కు, నిన్నే నమ్మి యుంటిని. నేను నీతి జ్ఞానహీనుడను, నన్ను నీవెట్లు రక్షించెదవో మహాత్మా నీదే నా భారము.

ఓం తత్ సత్ ఓం

(శాంతి మార్చి 1986)